# తల్లి చెర

రాత్రి పదకొండు దాటింది.

హాలు కిట కిట లాడుతుంది.

తెర పైకి లేచింది.

సూత్రధారుడి ప్రవేశం, నందిస్తుతి, మేళప్రాప్తి, గణేశుడి ఆశీర్వచనం ముగిశాయి.

రంగం మధ్యకు అడ్డుతెర వచ్చింది. ఆ తెరమీదుగా ప్రేక్షకులకు కనబడింది సత్యభామ జడ.

ఇరవయేడు నక్షత్రాలు, నాలుగువేదాలు, త్రిభువనాలు, నవగ్రహాలు, జీవం జ్ఞానం నిండివున్నవి ఆ జడలో.

ఆ జడను చూచి, దానిమీది అందాన్ని చూచి, దానిఅర్థాన్నిచూచి, దానినలంకరించిన పుష్పాలను, రత్నాలను, ముత్యాలను, ఆభరణాలను చూచి జనం ఆనందించారు.

కాని మొదటివరుస ప్రేక్షకుల్లో ఓ పత్రికా విలేఖరి వున్నాడు. అతగాడూ చూశాడు. జడను పరికించి మరీచూశాడు. 'హా తెలిసెన్' అనున్నాడు ఛందస్సూ పాడూ లేకుండా! అన్నాడు కూడా కాబోలు నెమ్మదిగా.

ఆ వెనుకవరుసలో వున్న మరోకాంప్లిమెంటరీ శాల్తీ అడిగింది. "ఏమి తెలిసెన్ ?"

"రేపొద్దున్న మా 'ఉదయశంకా' సిటీ ఎడిషన్ చదవండి" అన్నాడు అనేసి పెన్సిలూ, పుస్తకమూ పట్టుకొని చక చకా వెళ్ళిపోయాడు న్యూసు న్యూసొద్వేగభరితుడై ....

తెర తొలగింది.

"భామనే! సత్యభామనే!" అని దర్పంతో దబాయించి మరీ చెబుతోంది ఆ పేరుగలావిడ.

ప్రక్కపాటాయన పాడుతున్నాడు గాని ఆమె ఊపుకు అందుకోలేక పోతున్నాడు. మృదంగం వాయిస్తున్న మనిషి పదేళ్ళపాటు మరిచిపోయిన తాళం అప్పటి కప్పుడు కనుకున్నట్లుగా "ఇదిగో వచ్చె- ఇపుడె వచ్చె- ఇపుడె వచ్చె" అన్నట్లుగా మృదంగంమీద లంకించుకున్నాడు. చిరుతాళం వారు, చెక్కలవారు, వాయులీనంవారు పరమానంద భరితులై అమ్మగారి నాట్యకళా వైదగ్ధ్య మనేటువంటి ఆయొక్క సూర్యుడే ఓయమ్మా—

—ఆడేది సూరుండెటులాయెనే మాయమ్మా

—ఆయొక్క నాట్య సూర్యుడియొక్క కిరణ

—జాలాలయొక్క అరుణకాంతులే ఓయమ్మ.

—అరుణకాంతులా తరుణకాంతులా

చెప్పవే మాయమ్మా

ఆయొక్క కాంతుల్ని చూడలేక ఆయొక్క దరువువారున్నూ (వారున్నూ), ఆ యొక్క చిడతలవారున్న (రున్న), చెక్కలవారున్నూ (న్నూ) మహాబుద్ధిగా (తథికిన దిన) అతిచక్కగా (తళాంగుధిమి) తాళము వేయుచుండిరి.

తాళంగుధిమి, తకతైధిమి

తత్తైథిమి, తకతైధిమి....

[illegible]ంగా సాగిపోతున్నది భామయొక్క కలాపం.

[illegible] విలాపం మొదలయింది. తాపభారమునోపలేని యాభామా [illegible] యొక్క శంఖ చక్రాదులు ధరించి యున్నటువంటి శ్రీ దేవర [illegible] కమ్మరాజమును రాయడం మొదలు పెట్టించి.

[illegible]ంగు మంది హాల్లో గడియారం.

"అర్ధరాత్రివేళ ఉత్తరాలేమిటి" అని ఆవలిస్తూ లేచివెళ్ళిపోయాడాక [illegible]శ్వరరావుగారు.... మరునాడు కోర్టులో వినవలసిన సుదీర్ఘహియరింగు ఒకటి వుందికదా—

జనం తల లూస్తూన్నారు. దరువు అమోఘం, వంతపాట అద్వితీయం, చెక్కభజన అసమానం, దరువుకు తగిన అడుగు- అడుగుకు తగిన హొయలు హొయలకు తగిన గర్వం- ఓహో ఓహో....

"ఏమి ఈయన కళా వైదుష్యము" అని యొక రనుకొన-

"అయ్యారే- ఈలలన నటన ఇదినటనయా యనిపించుచున్నయది" యని మరియొక రనుకొన-

ఆ సత్యభామ జడకొన

అటూ ఇటూ వూగిపోతూంది నాట్యావేశంలో.

రసికులందరూ ఆనందసాగరంలో తేలియాడుతున్నారా. హఠాత్తుగా నిశ్శబ్దం ఆవరించిఁది.

జడ జడమయింది.

స్వర్గాన్నుంచి క్రిందకు, స్వప్నాల్లోంచి బయటకు వచ్చినట్లు ఉలిక్కిపడ్డారు ప్రేక్షకులు.

వాటీస్ దిస్! ? !

సత్యభామ మాట్లాడుతూంది. ఎస్, మామూలు మనుషులు మాట్లాడే తెలుగుభాషలో మాట్లాడుతూంది. రంగం మీద సాక్షాత్తూ ఆ సాత్రాజితి. నాట్యం మానివేసి, మైక్ ముందు కొచ్చి చేతులు కట్టుకుని నిలబడి మరీ మాట్లాడుతూంది.

సిద్ధేంద్రయోగీజీ! ఏమి టీఅన్యాయం! కూచిపూడి నాట్య నాయిక కిది తగునా? చెప్పండి, మీ రూలింగ్ ఇవ్వండి సార్-

"నే నిట్లా మాట్లాడుతున్నందుకు క్షమించండి, మీ పోషణే, మీ ఆదరణే నాకు ఊపిరి. మిమ్మలందరినీ పెద్ద, చిన్న అనే వ్యత్యాసం లేకుండా, రాజుల్ని రథాలను తోలేవాళ్ళనూకూడా ఈ కళా సామ్రాజ్యానికి రారాజులు చేయాలనే నాసంకల్పం. ఇది నచ్చని నా ప్రత్యర్థులు కొందరు నా మీదలేనిపోని అభాండాలు వేస్తున్నారు. వాటిని మీరేమాత్రమూ నమ్మకండి. నేను మీ అందరి ఆస్తి అయినట్టి ఈ సామ్రాజ్యంలో ఓభాగాన్ని నా తమ్ముడికి దత్తం చేశాననిట పెద్దమనిషి అన్నారు. అది పచ్చి అబద్ధం. ఎందుకంటె నాకు తమ్ముడంటూ లేడు గనుక! మానాన్నకు నే నొక్కర్తెనే బిడ్డనుగనుక! ... ఇంకొక అపవాదు ప్రచారం చేస్తున్నారు. నవరత్న ఖచితమైన హారాన్ని నేనెవరినుండో అన్యాయంగా సంపాదించానట!! దీనిని కూడ నేను ఖండిస్తున్నాను. ఇట్లాంటి రాహుకేతువు లెందరు యత్నించినా, నాకళ అనేటి చందమామ నిరంతరం వెలగాలని, ఆ సోయగాల వెన్నెలలో మీరందరూ హాయిగా వుండాలనీ మీభవిష్యత్తు సుదీర్ఘ శుక్లపక్షమై సాగాలని నే కోరుతున్నాను." అని తలవంచి, నమస్కరించి, ప్రక్కకు తిరిగి కనుసైగ చేసింది.

భామనే సత్యభామనే వయ్యారి సత్య

భామనే పదియారువేల భామలా యందారిలోన.

భామకో గోపాల మూర్తికీ—

—అందుకున్నారా పక్కవాద్యగాళ్లు, కలాపం మళ్ళీ సాగింది. రెండవ వరుసలోని కాంప్లిమెంటరీ శాస్త్రికి- ఇందాక పత్రికావిలేఖరి అంత అర్జెంటుగా పరుగెత్తడం ఎందుకోనన్న సత్యం లీలగా గోచరించింది.

ఆ యొక్క చందాన ఆ భామామణి చంపమామామణిని దివినుండి భువికి దింప, భూలోక వాసులందరికి తలోభాగమూ ఇస్తానన్నటువంటి ఆ సుదినానికి—

మరుసటిరోజు ఉదయం 'ఉదయఢంకా' సిటీ ఎడిషన్ చదువుతు న్నాడు శ్రీమాన్ కాంప్లిమెంటరీ శాస్త్రీ.

అతగాడు మన రాజకీయవిలేఖరి రాసిన "ఏమా కలాపం?" చదివి భోధిచెట్టుక్రింది గౌతముడయ్యాడు.

ఆ తర్వాత సంపాదకీయం వున్న పుటయొక్క ఏడవ, ఎనిమిదవ కాలమ్స్ తాటికాయంతఅక్షరాలుగా గల శీర్షికతో పైనుండి క్రిందదాకవున్న ప్రకటన ఒకటి అతడి కళ్ల పడింది.

"ధర్మం చర" అని శీర్షిక,

ఆ శీర్షిక క్రింద —

"పురజనులారా ! పుణ్యమూర్తులారా !

మిమ్మల్నందరినీ విడి విడిగా కలుసుకోలేని కారణంగా నే నీవిధంగా నామనసులోని విషయాలను మీ ముందుంచుతున్నాను.

నే నెవడినో మీకు తెలుసు, నాజీవిత గ్రంధమంతా మీకు సుపరిచితం. అటువంటి నేను, కొన్ని కారణాంతరాల వలన నా బంధు మిత్రుల నుంచి విడిపోయిన విషయమూ పాతచరిత్రే. అయినప్పటికి నా సోదరులు, మిత్రులు చేస్తున్న అసత్యప్రచారాన్ని నేను ఖండిచక తప్పడం లేదు.

నేను 1967 లో జరిగిన కురుక్షేత్రయుద్ధంలో అబద్ధం చెప్పి నా ప్రత్యర్థిని పడగొట్టానని ప్రచారం చేస్తున్నారు. ఇది అబద్ధం. నాకు ప్రత్యర్థులు లేరు. ఆ విషయాలు తెలిసిన మీబోటిపెద్దలు నన్ను 'అజాత శత్రువు' అన్నారు. నాకు విరోధుల మని ఎవరన్నా వారికి వారే అనుకో వచ్చునుగాక ; అటువంటివారు పతనమయితే అది కేవలం ధర్మ స్వరూపు డయిన ఆ భగవంతుడి శాపం వల్లనే, ప్రభావం వల్లనే గాని ఇంకెందువల్లా కాదు ఆ పరమాత్ముడి చేతిలో నేను కేవలం నిమిత్త మాత్రుణ్ణి

ఇకపోతే, నేను జూదాలాడుతాననీ, త్రాగుతాననీ ఇంకొక ప్రచారం జరుగుతూంది. ఇది పడమట సూర్యుడుదయించడంలాంటిది. నే నెప్పుడన్నా సరదాగా ఏ "పచ్చీసు" ఆటో ఆడతాను నిజమేగాని పణం ఒడ్డి ఆడను. ఒకనాడెప్పుడో సోదరుడు సుయోధనుడి మీద వాత్సల్యం కొద్దీ ఒడ్డితే ఒడ్డాను కాని అది నా సహజగుణం కాదు. నేను - సురను, దేశీదయినా విదేశీదయినా ఆదరించను.

నామీద మీకున్న అపారాభిమానాన్ని చూచి కన్నుకుట్టినవారంతా ఈ విధంగా నన్ను మీనుండి దూరం చేయాలని చూస్తున్నారు. ప్రయత్నాలు చేస్తున్నారు. వారి యత్నాలు వమ్ముచేయండి, నన్ను నమ్మండి, నాకు దూరంకాకండి, ధర్మాన్ని గెలిపించండి. ధర్మమే జయించాలి. ధర్మమే మీ ధర్మం కావాలి.

అందుకనే 'ధర్మంచర' అన్నారు.

కాని ఇప్పటి పరిస్థితులలో కేవలం "ధర్మంచర" మాత్రమే కాదు "ధర్మం చర చర" .... అంటే కాలయాపన ఏ మాత్రం లేకుండా చర చరమని ధర్మ విజయానికి కంకణం ధరించండి.

ఇట్లు మీ "ధర్మరావు"

అది చదివి నిట్టూర్చాడు కాంప్లి శాస్త్రీ పత్రిక ముగించాక, రెండవ డోస్ కాఫీకని వంటింటి వైపుకు నడిచాడు.

అతడు కాఫీ సేవిస్తుండగా ఆకాశవాణి, తన మూడు బ్యాండ్స్‌లో ఒకటయిన వాణిజ్యవాణి మీద గర గర లాడుతూ పలికింది.

మొదట పెద్దగా ఏదో పేలిన శబ్దం.

పిమ్మట అతిమధురమయిన లలిత సంగీతం

అదోనిముషం, ఇదోనిముషం.

"ఆ ప్రేలుడు ఏమిటి?" అంది ప్రకటనలో ఆడగొంతు.

"అది గాండీవపుటంకారం" అంది మగగొంతు

ప్రేలుడు: సంగీతం.

"ఆసంగీతం ఎక్కడిది?" అడిగింది మగ గొంతు.

"అది సుభద్రకోసం విజయుడి హృదయం పిలుపు!"

మళ్లీ ప్రేలుడు.... మళ్లీ...

"సర్వ ప్రజలూ సుభద్రలు కావాలంటే విజయం విజయుడిని వరించాలి" 'అంది ప్రయోక్త కంఠం.

మెడిసన్ ఎవెన్యూ - అనుకున్నాడు కాంప్లిశా

"మేష్టారూ?" అని వీధిలోంచి గొంతు విన పడితేచూశాడు. ప్రక్కింటి రామదాసు హడావిడిగా వస్తున్నాడు.

"ఈయన మళ్ళీ కీర్తనలూ గట్రా అంటూ లంకించుకుంటాడు- అవతల ఆఫీసుకు వేళయి పోతుంటేను" అని భయపడ్డాడు కాంప్లిషా.

రామదాసు ఆయాసంతో రొప్పుతున్నాడు. కాంషా చూశాడు. ఆయన చేతుల్లో సంచి వుంది. అది నిండుగావుంది. దాసుగారు సంచిని దించారు. చెమట తుడుచుకున్నారు.

"ఏమిటి దాసుగారూ ! ఇందులో వున్నదేమిటీ? హోషిషా, బంగారపు బిస్కెట్లా"

"హిప్పీలా అడిగారే?...." అని నవ్వి మరి కొంత ప్రాణవాయువును ఊపిరితిత్తులలోకి పంపించాడు దాసు.

"మరి అంత బరువేమిటి ?"

"చెప్పుకోండి చూద్దాం ?"

అయిపోయిన నాట్యాలకు నాటకాలకు వాడేసిన కాంప్లిమెంటరీలేమిటి ?'' అన్నాడు కాంషా.

చచ్చేట్లు నవ్వాడు దాసు. "భలేవారే. ప్రతి వాడూ ప్రక్కవాడి మీద దుమ్మెత్తి పోస్తున్న ఈ రోజుల్లో మీ మీద మీరే జోకులు వేసుకుంటున్నారే-ఇందులోది మీరన్నట్లు భంగూ కాదు. బంగారమూకాదు; మన భావయ్యగారి వాగ్దానాల పుస్తకం బాబూ-''

ఇందాక తమవు దస్సింది దాసుకు.

ఇప్పుడు మూర్ఛ వచ్చింది కాంషాకు,

"కాని ఓ విశేష ముందండోయ్....భీనుయ్య వున్నాడే.... రియల్ లవర్ ఆఫ్ ది గుడ్ థింగ్స్ ఆఫ్ లైఫ్.... భోగపురుషుడు ; రససిద్ధుడు.... ఈ పుస్తకంలో ప్రతి ఏడవ పేజీకూడా ఒక ఆహ్వానం. ఇట్లాంటివి యాభై రెండు ఆహ్వానాలున్నాయి...."

కాంషా కర్ణికా జఠరికా గట్టిగా కౌగలించుకున్నాయి. యాభై రెండు ఆహ్వానాలే ! అన్నీ కాంప్లిమెంటరీలే ! !

"ఒకటి 'సెఫైర్' లో లంచికి-ఇంకోటి 'లిడోలో కాక్‌టెయిల్-మూడవది 'తాజ్'లో కేబరే-నాలుగవది నటరాజ్‌లో ఫ్రెంచి 'రోజోడినాల్'-అయిదోది "గ్రాండ్ డిహోటల్స్" టూర్ లాంటిది-ఆరవది-

గిలగిల లాడిపోయాడు కాంషా. "బాబూ ఇక చెప్పకండి ... ఇంకో ఒక్కమాట వింటే నే చచ్చిపోతా--" నన్నాడు. తాను మిస్సయి పోతున్న ఆహ్వానాల వియోగదుఃఖం భరించలేక ....

".... అదేవిటి షాగారూ ! అటూ ఇటూ గాక ఇప్పుడెందుకూ జీవితం - ఇన్ని ఆహ్వానాలు పడివుంటే ఎన్‌జాయ్ చెయ్యక ?...."

కళ్ళు విప్పారాయి షాకు.

"నిజంగానా ! నిజంగానే ? కలకాదుగదా .... కలకాదుగా-" అంటూ ఆ మేడితాలకు అంకితమయ్యాడు కాంషా.

దాసుగారు ఆ ఆహ్వాన భరితమయిన ప్రమాణాలపుస్తకాన్ని షా కిచ్చాడు. షా దానిని - అతిభక్తితో- అందుకుని కళ్ళకద్దుకున్నాడు.

"నిజంగా దాసుగారు ! శిబి, దధీచి, జీమూతవాహనుడు వగైరా ఎక్కడోలేరు .... మీలోనే -"

"ఆ పోనిద్దురూ .... నాచేతికి రెండిచ్చారు మా ఆవిడ ఊళ్ళో లేదుకదా...."

"అయినా మట్టుకు-"

"అదేంకాదు కాని అసలీ భీమయ్య ఏం చెబుతాడంటే-"

'చెప్పండి-" అరఘంట చెప్పాడు దాసు. వీధికో ఫ్రీ హోటలు, వారానికో మాస్‌డిన్నర్ - ప్రతి అదివారం స్టేడియంలో 'ఫ్రీ'గా మల్లయుద్ధ ప్రదర్శన - ప్రామిస్ చేస్తున్నాడు భీమయ్య. కడుపునిండా తిండి, చేతినిండా అరిగేలా కసరత్తూవుంటే దేశానికి ఏ అనారోగ్యమూ వుండదని ఆయన వాదం .... అని సూతుడివలె చెప్పాడు దాసు.

"ముమ్మాటికి నిజమేనండోయి .... కాని ఎటొచ్చీ ప్రతివారమూ మల్లయుద్ధమే గాకుండా ఓవారం గయోపాఖ్యానం - ఇంకోవారం కూచిపూడి నాట్యం - ఇంకోవారం హరికథా కాలక్షేపం - ఇట్లా వైవిధ్యం వుంటే -

ఇంక భీమయ్యకు తిరుగులేదనుకోండి .... అబ్సొల్యూట్ మెజారిటీ .... కొయలిషన్లు, కాళ్ళ సేవలూ వుండవు ... ఆ!'' అనిసూచించాడు కాంషా.

దాసూ ఒప్పుకున్నాడు. ఒప్పుకోవడమేకాదు ఈవిషయమై ఓ అరడజను 'ఆర్యా' లేఖలు రాసి పారేద్దామనుకున్నాడు.

ఆ ప్రమాణాల పుస్తకంలోని ఆహ్వానాలు చూచిచూచి నవనాడులూ అష్టోత్తర గ్రంథులూ జివ్వుజివ్వుమని, కెవ్వుకెవ్వుమని ఘోషపెడుతుండగా ఘెరావో చేస్తుండగా బయలుదేరలేక ఆఫీసుకు బయలుదేరాడు కాంషా.

ఆఫీసు టైమయిపోయింది. తొమ్మిదిన్నర బస్సుకూడా చెక్కేసింది. పదింబావు బస్సు నెక్కాడు కాంషా.

ఆబస్సు ఆగవలసిన చోట్లకూడా, ఆగకుండా రయమున వెళ్తూంది. ఇంకో మైలు దూరాన కాంషాగారి కార్యాలయం వుంది అనగా బస్సు హఠాత్తుగా ఆగింది !

ఏమిటేమిటి ?

ముందుగా మున్ముందుగా అవేమిటి ?

అవి అలా ఆగిపోయా యేమిటీ ?

ఆబస్సు లేమిటి

అడ్డుగా ఏవన్నా వచ్చిందేమిటి ?

ఏ సెకురేటొరే గారో, ట్రాడో బ్రాడో గారో విచ్చేశారేమిటి ?

పట్టపగలాఫీసువేళ ఈ అడ్డాలేమిటి ?

పంక్చుయాలిటీకి ఇట్లా అడ్డాలొస్తే ఈదేశం ఇంక బాగుపడేదేమిటి ?

-అనుకుని, విసుక్కుని, తిట్టుకుని, అసలుకారణం కనుక్కుని, బస్సుదిగి నిల్చున్నారు వా (''ఐబెగ్‌టు రిమెయ్న్‌సార్, యువర్స్ మోస్ట్ ఒబీడియంట్లీగా) ళ్ళంతా.

అప్పుడు ఆ రాజధానిలోని రాజవీధికి అడ్డంగా వెళ్తున్నారు

కండలాది అశ్వాలు.

అందమైన అశ్వాలు.

ఆ అశ్వాలమీద -

అందానికి మారు పేర్లయినవారు,

మారుని మరురూపాలవారు

చందమామకు సిగ్గుతెచ్చే సోగ్గాళ్ళు

వెళ్ళుతున్నారు ---

ఠీవిగా -

హాయలుగా -

హుందాగా - వెళ్ళుతున్నారు.

ట్రాఫిక్ - అంతా ఆగిపోయింది.

ఆగినవారంతా ఆగ్రహాన్ని, ఆలస్యాన్ని మరిచిపోయి - ఆదృశ్యాన్ని, ఆ దృశ్య కావ్యాన్ని ఆ కావ్యసౌందర్యాన్ని, ఆ సౌందర్య ప్రవాహాన్నిచూచి_

చూచి చూచి -

ఆనందించారు ; ఆశ్చర్యం చెందారు.

అయ్యారే ! అనుకున్నారు.

'ఓహ్ మై !' అనికూడా - అనుకున్నారు.

అంతోటి పింగళకులే - అట్లాయిరనగా మై డియర్ దమనకా - మన మెంతవారము ---

లలనల కందరకు కలవరమాయె మదిలో - ఆ మదిలో ---

ఈ అశ్వదళం

ఇందరు - అందగాళ్ళ దళం

ఎక్కడిదండీ! ఎవ్వరిదండీ?

ఎందుండి ఎందు పోతున్నారండీ?

చూడండి: ఆ అశ్వాలకిరువైపుల వ్రేలాడే బావుటాలను చూడండి -

ఆ మన్మధుల చేతులనుండేని కేతనాలనుచూడండి.

"సత్యమైనదే శివం.

శివమైనదే సుందరం

సత్యం శివంసుందరం

కావాలి నిరంతరం

అని అంటే మీ హృదంతరాళం

ఉన్నదొక్కటే శరణ్యం

అదీ మీకు చెప్పడం

మీ వివేకాన్ని పరిహసించడం

— ఇట్టు. మీవాడు

నకులసేనుడు"

ఆహా! ఆహా హా!

ఓహో! ఓహోహో!

మనిషెంత నాజూకయినవాడో మాట అంత అందంగావుంది.

మాటెంత స్వీటో మనిషంత నీటూగోటూగాను- అనుకున్నారు పుణ్యమూర్తుయి, పురజనులు.

అశ్వా రూఢులు సాగిపోయారు.

బస్సు కదలింది. బస్సులు కదలాయి.

కాంషా అండ్ కంపెనీ తమతమ కార్యాలయాలను చేరి తెల్లటికాగి తాలను నలుపు చేయసాగారు.

నాలుగు కాగితాలు రంగావిధంగా మార్చంగా వారికి అలసట వచ్చింది ఆ వెంటనే. "పాఠశాలలో— మైదానములో: ఓ : ఓ : ఓ :" రక్తి శక్తీ యుక్తీ ఇచ్చేటి పానీయాలను తాగడానికి కేంటీనుకు వెళ్ళారు. అక్కడ 'టీ సెరిమనీ' అనేటి వ్రతాన్ని అతి శ్రద్ధాసక్తులతో, సాంగో పాంగంగా నెరవేర్చి, మళ్ళీ తమ తమ కుర్చీల దగ్గరకు వెళ్ళి, కాగితాలను కూర్చి, గుచ్చి, పేర్చి, రూళ్ళ ఇటుకలతో అడ్డగోడలు కట్టి మళ్ళీ అలసి పోయారు. ఒంటిగంటయింది.

ఒకటిన్నరనుండి భోజనాలవేళ, కాని ప్రభుత్వ "చేనేత" విక్రయ శాల లన్నిటా కాలానికి సదా సర్వదా ఇరవై ఐదు శాతం డిస్కౌంట్ యివ్వ బడును. అందువలన—

ఆ జనులు,

తమతమ ప్రియమైన బందీఖానాల నుండి బయటపడి

—ఎండలో

—వెలుతురులో

—గాలిలో

తిరగసాగారు.

ఆ లంచ్ వేళ—

వివిధ స్కేళ్ళమీద పాకుతుండే ఆ ప్రభుత్వతప్పురుగులు మనుష లుగా తిరిగేవేళ—

ఆ కార్యాలయాల కూడలి స్థలమయిన మైదానంలో మైకులు, లౌడ్ స్పీకర్లు అతి లౌడ్‌గా అరుస్తున్నాయి. ఆ అరుపుల్లో "అంబా" నాదాలు అతిగా వున్నాయి.

ఆ నాదాలచే ఆకర్షితుడయిన కొంషా $(\times 821 \times 9 \times 13)$ లు ఆ మైదానంలోకి అడుగు పెట్టారు.

వేదిక

వేదికచుట్టూ తెల్లటి ఆవులు

ఆవులమెడలో గంటలు.

గంటలున్న ఆవులమధ్య వేదిక.

వేదికమీద కుర్చీలు; కుర్చీలమీద కూర్చొనసనాలు ధరించిన పెద్దలు.

పెద్దలయెదుట మైకులు.

మైకులలో కాకిగోల.

ఆవుల అంబా గోల.

పెద్దల జగదాంబా గోల.

ఆబాల గోపాలమూ విన్న ఆగోల సారాంశం

గోవు మన తల్లి. గోవు స్వచ్ఛతకు చిహ్నం. స్వార్థ రాహిత్యానికి చిహ్నం. అందుకనే అది మన మాత; మనదైవం. అటువంటి గోవు, మన దేశానికి ప్రతీకవంటిదయిన గోవు సురక్షితంగా వుండే దేశం సుసంపన్న మయిన దేశం. గోశత్రువులను నాశనం చేయండి. గోముఖవ్యాఘ్రాలకు గోతులు త్రవ్వండి. మేకవన్నె పులులకు పాఠం చెప్పండి.

ఆవుపాలవలె స్వచ్ఛమయిన జీవితం కావాలంటే—

పాలపొంగులవలె దేశంలో ప్రగతి పొందాలంటే—

ఏమి చేయాలో తెలుసా ?

ఇదుగో ఈయన....

ఎవరండీ ఆయన? అని ఎంక్వైరీ వారిని అడిగాడు కాంషా.

సహదేవసింగండీ బాబూ, పోయిన్సారి ఐక్యరాజ్య సమితిలో కాశ్మీరు సమస్య గురించి మాట్లాడేడూ....

అలాగుషా - అన్నాడు కాంషా.

మైకుల పెద్దల ఆవుల కాకుల జగదాంబాలు అంబాలు సాగుతూనే వున్నాయి;

రెండున్నరయింది.

రెండింటికే తమతమ నెలవులలో తప్పకుండా వుండవలసిన ఆ భృత్యగణమంతా హుటాహుటీ బయలుదేరి మూడింటికల్లా తమతమ ఉత్తమ, మధ్యమ, అధమ-కుర్చీలలోని ఖాళీస్థలాలను పూర్తిచేశారు.

ఆ సాయంకాలం సూర్యుడూ,

మరియూ కాంషా ఇంటికి వెళ్తున్న వేళ—

సత్యభామ మరో ధీమా కలాపానికి రిహార్సలు వేసుకుంటున్న వేళ—

వెలుతురు వెనకడుగు వేస్తుండగా,

వెలుతురు కానిది వామనుడయి విస్తరించే వేళ—

—సుశాసనుడుగా చలామణి అవుతున్న ఒకానొక దుశ్శాసనుడు- శ్రీమతి ద్రౌపదిమీద ఎన్నోనాళ్ళనుండి మనసున్నవాడు --

పర్మిటు లేకుండానే 'వాట్-69'ల నిచ్చెనలెక్కి- ఉచ్ఛైశ్రవాలనెక్కి- ఖుషీఖుషీగా, మజామజాగా, జగమే ఊయలగా, తనువే కోయిలగా

ఊగుతూ-- తాగుతూ-- పాడుతూ--

ద-రౌ-ప-పీ — హోనా-దరో--

ఓ-నా-దరో-పదీ--

అంటూ పాడు

కుంటూ - తూలు

కుంటూ---

కుంటుకుంటూ వెళ్ళివెళ్ళి

రామన్న పేటలో- ఆలయం వీధిలో-ఒంటిరిగా-ప్రశాంతంగా జీవితపు సంధ్యాకాలాన్ని గడుపుతున్న ఆమె ఇంట్లోకి ప్రవేశించి --

ఆమె జుత్తుబట్టి వీధిలోకి—

ఆమె చీరబట్టి దారిలోకి—

ఆమె పేరుబట్టి నలుగురిలోకి—

ఆమె మానంబట్టి బజారులోకి--

లాక్కొచ్చి-- పీక్కొచ్చి

హహ్హా – దరొపదీ—

ఓనా పదీ- దరోపదీ—

దొరికి - చిలకా - నావు

నాకూ - హహ్హా - నీవూ

అంటూ

కదం తొక్కుతూ

పదం పాడుతూండగా

ఆనహాయులుగా కొందరు—

ఆనందిస్తూ కొందరూ—

ఆ నగరవాసులు శిలలై నిలబడి వుండగా--

ఆమె—

"ఒరేయ్! నేను ద్రౌపదిని కానురా మూర్ఖుడా! కళ్ళు తెరవరా!"

అని కేకలు పెడుతుండగా—

ధర్మారావుకు పక్కింటాయన చెప్పాడు.

ఫోను పలికింది విజయుడి చెవిలో.

పరుగెత్తు, పరుగెత్తు - అన్న సందేశం అందింది భీమయ్యకు.

"లగెత్తసే...." అన్నాడు నకులుడి చాకలి పేరిగాడు.

గోమాత తరువాత-ముందుగా నీ మాత అని విన్నాడు సహదేవ సింగు.

వారందరూ రొప్పుతూ రోజుతూ

రామన్న పేటలో

ఆలయం వీధిలో

ఆ చోటికి

అన్యాయం దుశ్శాసనుడై తాండవిస్తున్న చోటికి

ఆక్రందనం కుంతీదేవిగా విలపిస్తున్న చోటికి

వెళ్ళేలోపుగా—

అన్నదమ్ములందరూ ఒకటయే లోపుగా....

"తనయులారా! హా, శ్రీకృష్ణా!"

అని వారి తల్లి తల్లడిల్లినప్పుడు—

వా రేమి చేశారు?

ఆ కన్నకొడుకులు ఏమి చేశారు ?

ఆ కన్నతల్లి ఏమయింది?

ఆ విన్న కృష్ణుడు వచ్చాడా?

*

[వచ్చే వుండాలి.
దుశ్శాసనుడు చచ్చే వుండాలి.
ఉండకపోతే-
ఈ దేశంలో ప్రజాస్వామ్యానికి రేపన్నది
లేనేలేదు.]

★